క్లుప్తంగా

నేడు కార్తీక దీపోత్సవం

గణపురం: కార్తీక పౌర్ణమి సందర్భంగా గణపురం మండలకేంద్రంలోని కోటగుళ్లు, రెడ్డిగుడిలలో కార్తీక దీపోత్సవం నేడు (శుక్రవారం) నిర్వహించుటకు నిర్వాహకులు గురువారం ఏర్పాట్లు పూర్తి చేశారు. కోటగుళ్లలో 11వేలు, రెడ్డిగుడిలో ఐదు వేల దీపాలు వెలిగించేందుకు ఆలయ నిర్వహణ కమిటీ ప్రమీదలను, నూనెను అందుబాటులో ఉంచారు. దాతల సహాయంతో కార్తీక దీపోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సాయంత్రం ఆరు గంటలకు కార్తీక దీపోత్సవం కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్‌గా రాజు

కాటారం: మండల కేంద్రానికి చెందిన పస్తం రాజు జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. ఇటీవల వెలువడిన గ్రూప్–4 ఫలితాల్లో రాజు అర్హత సాధించారు. దీంతో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి కావడంతో గురువారం వెలువడిన ప్రొవిజనల్ జాబితాలో రాజు జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

భూపాలపల్లి అర్బన్: మండల పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు సీఐ నరేష్‌కుమార్ గురువారం తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహేందర్, రామయ్య, రాయగట్టులు సెల్‌ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. దీంతో ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు.

గణపురంలో చోరీ

గణపురం: మండల కేంద్రంలో పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని కాలనీలో గురువారం మధ్యాహ్నం మూడు ఇళ్లల్లో చోరీ జరిగింది. గురువారం పట్టపగలే కనుకుంట్ల నరేష్, కనుకుంట్ల విజయ్, ఎస్‌కె ముజ్జు ఇళ్లలో ఎవరు లేని సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. నరేష్ ఇంట్లో రూ.11,500 నగదుతో పాటు వెండి బ్రాస్‌లేట్, మట్టెలు విజయ్ ఇంట్లో వెండి ఆభరణాలు, ముజ్జు ఇంట్లో రూ.4వేల నగదుతో పాటు ఆభరణాలు పోయాయని బాధితులు తెలిపారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వారం రోజుల క్రితం కూడా ఇదే కాలనీలో నాలుగు ఇళ్లల్లో చోరీ జరిగింది.

ఉద్యోగుల నిరసన

కాటారం: వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో కలెక్టర్, అధికారులపై దాడిపై గురువారం మహాముత్తారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట అధికారులు, సిబ్బంది నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై దాడిని ఖండించారు. జిల్లా జేఏసీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, సిబ్బంది ఫక్రుద్దీన్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో సహకార వారోత్సవాలు

కాటారం: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో గురువారం సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన సహకార జెండాను వైస్ చైర్మన్ దబ్బెట స్వామి ఆవిష్కరించారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సంఘం సేవలను మరింత విస్తృతం చేయడానికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ ఎడ్ల సతీశ్, డైరెక్టర్లు జక్కుల అజయ్‌కుమార్, ఐలి రాజబాబు, దండ్రు రాజయ్య, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



కాటారం: కార్తీకమాసం పురస్కరించుకొని గురువారం మండలంలోని మేడిపల్లి ఉసిరివనంలో సామూహిక సత్యనారాయణవ్రతాలు నిర్వహించారు. పురోహితులు వేదమంత్రోచ్చరణల మధ్య వ్రతాలు జరిపించారు. అనంతరం అందరు ఒకే చోట భోజనం చేసి ఆహ్లాదంగా గడిపారు. కాగా కార్తీకమాసంలో ఉసిరివనంలో సామూహిక సత్యనారాయణవ్రతాలు నిర్వహించడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో చల్ల జక్కిరెడ్డి, చేకూర్తి జల్మయ్య, చీర్ల రాజబాబు, గద్దె సమ్మిరెడ్డి, చిన్నసమ్మిరెడ్డి, కామిడి వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి దంపతులు పాల్గొన్నారు.

భూపాలపల్లి అర్బన్: నేరేడుపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో వేషధారణలతో విద్యార్థులు



కాళేశ్వరం: బహుమతి తీసుకుంటున్న విద్యార్థులు



మొగుళ్లపల్లి: ఎంజేపీ పాఠశాలలో బాలల దినోత్సవం..



భూపాలపల్లి అర్బన్: సన్‌వ్యాలీ పాఠశాలలో..



ఘనంగా బాలల దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పలు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. పలు పాఠశాలల్లో అధికారులు, దాతలు పాల్గొని పెన్నులు, నోట్ బుక్స్, బ్యాగులు, పరీక్ష ప్యాడ్లను అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్



భూపాలపల్లి అర్బన్: మాంటిస్సోరి పాఠశాలలో నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు



కాటారం: చింతకాని హై స్కూల్‌లో..



కాళేశ్వరం: స్వయం పాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



వెంకట్రావుపల్లి (సీ) అంగన్‌వాడీ కేంద్రంలో..



కాటారం: ఆదర్శ హై స్కూల్‌లో..



సోమనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..



జూకల్ ప్రాథమిక పాఠశాలలో..



చిట్యాల: కాకతీయ హైస్కూల్‌లో..



మొట్లపల్లిలో పాఠశాలలో..



వెలిశాల నవచైతన్య ఉన్నత పాఠశాలలో..

పత్తి వ్యాపారి నిలువు దోపిడీ

- క్వింటాకు 20 కిలోల తరుగు
- తిరగబడిన రైతులు

చిట్యాల: పత్తి వ్యాపారి రైతులను మోసం చేసిన సంఘటన మండలంలోని గోపాలపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, రైతులు తెలిపిన కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం గుంజిమడుగు గ్రామానికి చెందిన తుర్పాటి అశోక్ కొంత కాలం నుంచి మండలంలోని గోపాలపూర్ గ్రామంలో రైతుల వద్ద నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నాడు. రైతుల అమాయకత్వాన్ని అసరాగా చేసుకుని నిలువు దోపిడీ చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం గ్రామంలో తిరిగి సుమారు 150 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశాడు. గ్రామానికి చెందిన ఓ రైతు 6 క్వింటాళ్ల పత్తిని బయట తూకం వేసికుని ఇంటి వద్దనే ఉంచుకున్నాడు. అదే రోజు పత్తి వ్యాపారి వచ్చి ఆ పత్తిని తూకం వేయగా క్వింటాల్‌కు 20 కిలోలు తరుగు వచ్చింది. గమనించిన రైతు మిగితా రైతులకు సమాచారం ఇచ్చి పత్తి వ్యాపారి చేసిన మోసాన్ని పసిగట్టి అతడితో గొడవకు దిగారు. దీంతో గొడవ జరుతుందని గమనించిన పత్తి వ్యాపారి తన వెంట



పత్తి వ్యాపారి వాహన టైర్లలో గాలి తీస్తున్న రైతులు

తెచ్చుకున్న వాహనంతో వెళ్లేందుకు తీవ్ర ప్రయత్నం చేశాడు. రైతులు పత్తి వ్యాపారి వెళ్లకుండా అతడి వాహనం టైర్లలో గాలి తీశారు. అనంతరం స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని విచారణ జరిపి పత్తి వ్యాపారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు బాధిత రైతులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్సైని వివరణ కోరగా గ్రామంలో పత్తి వ్యాపారి చేసి మోసాన్ని గుర్తించి వివరాలు సేకరిస్తున్నామన్నారు. జిల్లా వ్యవసాయ మార్కెట్, తూనికల, కొలతల అధికారులతో మాట్లాడి బాధితుడిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం



గణపురం: భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



భూపాలపల్లి అర్బన్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: రాష్ట్రంలో నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని చెల్పూరు గ్రామంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఆయన కలెక్టర్ రాహుల్‌శర్మతో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యా రంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. చెల్పూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మరింత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సన్నరకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని జంగుపల్లి గ్రామంలో కలెక్టర్ రాహుల్‌శర్మతో కలసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తూకంలో జాగ్రత్తలు తీసుకోవాలని, 17శాతం తేమ ఉంటే తక్షణమే కొనుగోలు చేసి ట్రక్ షీట్ జారీ చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాల్సిన బాధ్యత కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లదే అన్నారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత తడిచిన, మిల్లర్లు మోసం చేసిన కొనుగోలు దారులు బాధ్యత వహించాలన్నారు.

పీఏసీఎస్‌లతో రైతుల అభివృద్ధి

రేగొండ: ప్రాథమిక సహకార సంఘాలతో రైతుల అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సహకార సంఘాల వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం బ్యాంకు ఆవరణలో గురువారం ఆయన జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరస్పర సహకారంతోనే రైతుల అభివృద్ధి సాధ్యమని, అందుకు సహకార సంఘాలు చేయూతనందిస్తాయన్నారు. రైతులకు, బడుగు బలహీన వర్గాలకు ఆర్థిక బలోపేతం చేయడమే సహకార సంఘాల లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం సొసైటీల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఓ బాల్యాయక్, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్ రావు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు సంపత్ రావు, మోడెం ఉమేష్ గౌడ్, పున్నం రవి పాల్గొన్నారు.

గ్రంథాలయాల ద్వారా విజ్ఞానం పెంపు

భూపాలపల్లి అర్బన్: గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేయడం వలన విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకోవచ్చని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై సరస్వతి, జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాల వేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, గ్రంథాలయ కార్యదర్శి శ్రీలత, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, జిల్లా పరీక్షల విభాగపు అసిస్టెంట్ కార్యదర్శి శనిగరపు భద్రయ్య, జిల్లా సైన్స్ అధికారి స్వామి, గ్రంథాలయ సిబ్బంది చంద్రమౌళి, శారద, రవీందర్ పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్నటువంటి ఆరు పాఠశాలలను ఉన్నతమైన, మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుటకు రాష్ట్ర ఐటీశాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు హైదరాబాద్‌కు చెందిన క్షేత్ర ఆర్కిటెక్ట్ కన్సల్టెంట్ బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. ముందుగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి పాఠశాలల అభివృద్ధికి కావలసిన మౌలిక వసతుల ఏర్పాట్లపై చర్చించారు. అదనపు తరగతి గదుల నిర్మాణం, మరమ్మతులు, తాగు నీరు, మూత్రశాలల ఏర్పాటు చేయుటకు పాఠశాలల వారీగా వివరాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా కన్సల్టెంట్ బృందం సేకరించారు. అనంతరం జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల ఆవరణను కన్సల్టెంట్ బృందం ప్రత్యక్షంగా సందర్శించారు. పాఠశాలను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుటకు కావలసిన సదుపాయాలపై నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు. కన్సల్టెంట్ బృందం వెంట ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ సాయిలు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మల్హర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లు రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కొండంపేట, కాటారం మండలం శంకరంపల్లి గ్రామాలల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు, రైతులకు విక్రయాల్లో పాటించాల్సి జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కొలతలు, నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించడం వంటి అంశాలపై కేంద్రాల ఇన్‌చార్జ్‌లు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులకు సంపూర్ణ సహకారం అందిస్తూ ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

టోల్‌టాక్సీ టెండర్‌తో రూ.6.36లక్షల ఆదాయం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామ పంచాయతీ గోదావరిలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం టోల్‌టాక్సీ టెండర్ నిర్వహించగా హెచ్చు పాటదారు రూ.6.36లక్షలకు దక్కించుకున్నట్లు డీఎల్‌పీఓ వీరభద్రయ్య తెలిపారు. గురువారం టోల్‌టాక్సి ఏర్పాటుకు టెండరుకు పిలువగా 35మంది పాటదారులు వచ్చారు. అందులో కాళేశ్వరం గ్రామానికి చెందిన రేవెల్లి నాగరాజు హెచ్చు పాటద్వారా టెండరు నాలుగు నెలల పదిహేను రోజులకు దక్కించుకున్నారు. ఆయన గురువారం సాయంత్రం నుంచి కాళేశ్వరానికి వచ్చే వాహనాలకు ప్రవేశ రుసుము తీసుకోవాలని అధికారులు సూచించారు. రాత్రి నుంచి టోల్‌టాక్సీ వసూలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్, ఎంపీఓ ప్రసాద్, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



టోల్ వసూలుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

బ్యాట్స్, పుస్తకాల పంపిణీ



బ్యాట్లు అందజేస్తున్న దాతలు

చిట్యాల: మండలంలోని జూకల్ ఉన్నత పాఠశాలలో టాలెంట్ టెస్టులో, ఆటల పోటీల్లోని విజేతలకు గ్రామానికి ఉపాధ్యాయుడు పంచిక భగవాన్‌రెడ్డి షెటిల్ బ్యాట్స్, జనరల్ నాలెడ్జ్ బుక్స్ బహుమతిగా అందజేశారు. కాగా గురువారం భగవాన్‌రెడ్డి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. అలాగే ప్రధానోపాధ్యాయుడు జి.కృష్ణ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన శ్రీరాధ కృష్ణ ట్రేడర్స్ అధినేత చాడ సుదర్శన్‌రెడ్డి ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు చికెన్‌తో తిథి భోజనం ఏర్పాటు చేశారు. కావ్య, సుమలత, సంధ్య, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో గోదావరికి హారతి


కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి దేవస్థానం పరిధిలోని త్రివేణి సంగమ గోదావరికి కార్తీక మాసం పంచరత్నాల్లో భాగంగా మూడవ రోజు హారతి కార్యక్రమాన్ని ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. గురువారం దేవస్థానం నుంచి మంగళ వాయిద్యాలు, మంగళహారతులతో తరలివెళ్లారు. గోదావరిమాతకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో హారతి కార్యక్రమాన్ని ఉపప్రధాన అర్చకుడు పనకంటి ఫణీంద్రశర్మ, శ్రావణ్‌శర్మ, రాముశర్మలతో పాటు బైకుంఠపాండాలు నిర్వహించారు. సూపరింటెండెంట్ శ్రీనివాస్, స్థానిక భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆకాశ దీపాన్ని వెలిగించారు. సామూహిక దీపాలంకణను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. గోదావరి తీరం, ఆలయ సరిసరాల్లో రద్దీ కనిపించింది.



గోదావరికి హారతి ఇస్తున్న భక్తులు

నష్టపరిహారం చెల్లించేలా చూడండి

మల్హర్: తాడిచర్ల కాపురం గ్రామాల జెన్‌కో భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించేలా చూడాలని జెన్‌కో భూనిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసు రెడ్డిని కలిసి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. జెన్కో సంస్థ బొగ్గు తవ్వకాల కోసం భూమిని సేకరిస్తున్న సమయంలో తాడిచర్ల కాపురం గ్రామాల్లోని కొంతమంది రైతులకు నష్టపరిహారం అందించలేదని తెలిపారు. ఎస్సీ ఎస్టీ కులాలకు చెందిన సన్న ,చిన్న కారు రైతులని, కాపురం శివారులోని 488, 489, 574,586 సర్వే నంబర్‌లో రైతులకు నష్టపరిహారం అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పలు సమస్యలను మంత్రికి వివరించారు.



వినతిపత్రం ఇస్తున్న భూ నిర్వాసితులు